వెదురుబుట్టలు.. అదిరేట్టు

• శుభకార్యాలలో పెరుగుతున్న వినియోగం • ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ట్రెండింగ్ • పల్లెల నుంచి పట్టణానికి సరఫరా





చొప్పదండి: పురాతన కాలం నుంచి వెదురుకు ఉన్న ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు. మనిషి పుట్టింది మొదలు గిట్టే వరకు ఆవశ్యకత తగ్గడం లేదు. వీటితో చేసిన వస్తువులతో పాటు వెదురు బొంగులను చీరడం ద్వారా వచ్చే పుల్లలతో చేసే అంచెలు, గంపలు, బుట్టలను ఆదినుంచి వినియోగిస్తున్నారు. మారిన పరిస్థితుల్లో ప్రజలు ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నయంగా వెదురు వస్తువులను ఉపయోగించడం ఇప్పుడు ట్రెండింగ్‌గా మారింది. ముఖ్యంగా శుభకార్యాలలో వెదురు బద్దలతో చేసిన వస్తువుల వాడకం బాగా పెరిగింది. పల్లె కల్చర్‌తో పాటు సిటీ కల్చర్‌లోనూ వెదురు వస్తువులు ముందంజలో ఉన్నాయి.

గతంలో ఇళ్ల నిర్మాణంలో..

వెదురు బొంగులతో ఇళ్లు నిర్మించుకునేవారు. ప్రస్తుతం భవనాలు నిర్మించినా కూలీలకు ఉపయోగకరంగా పరంచ, నిచ్చెనలు తయారు చేస్తున్నారు. ఇళ్లలో ఇప్పటికీ గంపలు,అంచెలు, బుట్టలు, చాటల పేరుతో వెదురుతో తయారు చేసిన వస్తువులను ప్రజలు వాడుతున్నారు.

శుభకార్యాల్లో ట్రెండ్..

ప్రస్తుతం వివాహాది శుభకార్యాలలో వెదురు వస్తువుల వాడకం ట్రెండ్‌గా మారింది. ఆర్కిటెక్చర్ సంస్కృతి వచ్చినా వెదరుతో తయారు చేసిన ఫొటో ఫ్రేమ్, కుర్చీలు, టేబుల్లు, పుస్తకాల అరలు అందంగా తయారు చేస్తున్నారు.

మహిళలకు ఉపాధి..

వెదురు వస్తువుల తయారీలో మహిళలు ఉపాధి పొందుతున్నారు. చొప్పదండి పట్టణంతో పాటు ఆర్నకొండలో తయారు చేస్తున్న బుట్టలు, అంచెలకు డిమాండ్ ఉంది. కరీంనగర్, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెదురు ఉత్పత్తులను సరఫరా చేస్తున్నారు. వీటిని అందరంగా అలంకరించి పట్టణాల్లో అమ్ముతున్నారు. అంచెలు, గంపటు, బుట్టలను ముఖ్యంగా మహిళలే తయారు చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా జన్నారం తదితర ప్రాంతాల నుంచి వెదురు బొంగులను దిగుమతి చేసుకుంటున్నారు. బుట్టలను రూ.30 నుంచి రూ.160 వరకు అమ్ముతున్నారు. ప్రకృతి నుంచి వచ్చే వెదురు వస్తువుల వాడకం పెంచి ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా వెదురు ఉత్పత్తులకు ప్రోత్సాహం అందించాలి.

గిరాకీ ఉంది



వెదురు వస్తువులకు గిరాకీ ఉంది. బయటి ప్రాంతాల వారు వచ్చి కూడా కొనుగోలు చేస్తారు. పెళ్లి, ఇతర శుభకార్యాలయాలకు కొనుగోలు చేస్తున్నారు. ఎన్ని ప్లాస్లిక్ వస్తువులు వచ్చినా వెదురుకు ఉండే ప్రాధాన్యత వేరు. – రాజమ్మ, చొప్పదండి

వారసత్వంగా తయారీ



వెదురు ఉత్పత్తులను వారసత్వంగా తయారు చేస్తూ వస్తున్నాం. శుభకార్యాల్లో వెదురు వస్తువులకు ప్రాధాన్యత తగ్గడం లేదు. ప్రస్తుతం బుట్టలు, అంచెలను గంపగుత్తగా కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. మా వద్దకు వచ్చినా అమ్ముతున్నాం. – సరోజన, ఆర్నకొండ

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



ఆహ్వానపత్రిక ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రసమయి

మానకొండూర్: అర్హులైన లబ్ధిదారులకు మార్చి, ఏప్రిల్‌లో డబుల్ బెడ్‌రూం ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం మూడు లక్షలు అందించనుందని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని దేవంపల్లిలో శనివారం రూ.20 లక్షలతో నిర్మించే గ్రామ పంచాయతీ భవనానికి భూమిచేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తుందన్నారు. గ్రామాల్లో 70 శాతం అభివృద్ధి పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. నూతన గ్రామ పంచాయతీలతో పాటు శిథిలావస్థకు చేరి పాలనకు ఇబ్బందిగా మారిన గ్రామ పంచాయతీల స్థానంలో కొత్త జీపీ భవనాలు నిర్మిస్తుందన్నారు. ఇంటి స్థలం ఉన్న వారికి నగదు ఇవ్వడం జరుగుతుందని, గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. సుడా చైర్మన్ జీవీ రామక్రిష్టారావు, జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచులు మాదవరం రమ, దేవ సతీష్‌రెడ్డి, సాయవేని రాజు, ఎంపీటీసీ మాదవరం జానకీ, ఉప సర్పంచ్ శ్రీనివాస్, టీఆర్ఎస్ నా యకులు వెంకటేశం నాయకులు ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి, కాంట్రాక్టర్ దేవసాని పాపయ్య, పంజాల శ్రీనివాస్ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

శంకరపట్నం: కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికను క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. చైర్మన్ మలహాల్ రావు, జెడ్పీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్, సర్పంచ్‌లు సతీష్‌రెడ్డి, రంజిత్‌రావు,కిషన్‌రావు,నాయకులున్నారు.

తిమ్మాపూర్: సమస్యలు పరిష్కరించాలంటూ నియోజకవర్గంలోని వీవోఏలు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎల్ఎండీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో రసమయిని కలిసి సమస్యలపై వినతిపత్రం అందించారు. సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర: మండలంలోని బూరుగుపల్లి, నారాయణపూర్, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శనివారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజగోపాల్ రెడ్డి, సింగిల్ చైర్మన్ దూలం బాలాగౌడ్, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు నవీన్‌రావు, నాయకులు, పలువురు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మల దహనం, క్షీరాభిషేకం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుజూరాబాద్: గవర్నర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం అంబేడ్కర్ చౌరస్తా వద్ద బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఈటల రాజేందర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈటల రాజేందర్‌కు వస్తున్న ఆదరణను ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతున్న ఈటలను చూస్తే నాయకులకు వణుకు పుడుతుందని ఎద్దేవా చేశారు. కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను మహిళలు ఖండిస్తుంటే క్షీరాభిషేకం చేయడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ నాయకులకు మహిళల పట్ల గౌరవం లేదని ఇటీవల జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా నిదర్శనమన్నారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు రాజు, జిల్లా కార్యదర్శులు కరుణాకర్, మంజులవాణి, జిల్లా ఆఫీస్ సెక్రెటరీ, పట్టణ, మండల ప్రధాన కార్యదర్శులు, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు, పట్టణ ఉపాధ్యక్షుడు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా

పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శనివారం బీఆర్ఎస్ నాయకులు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని రాజకీయంగా ఎదుర్కోలేక ప్రజలను తప్పుదారి పట్టించేందుకు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు పాటించాలి



వరిని పరిశీలిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

హుజూరాబాద్‌రూరల్: వరిలో తెగుళ్ల నివారణకు రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని జూపాక, బొత్తలపల్లి గ్రామాల్లో వ్యవసాయ పరిశోధన స్థానం, జిల్లా ఎరువాక కేంద్రం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంటపొలాలను పరిశీలించారు. మొగి పురుగు, అగ్గి తెగులు, సల్ఫైడ్ దుష్ప్రభావం గుర్తించి నివారణ చర్యలు వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు విజయభాస్కర్, మధుకర్ రావు, రాజేంద్రప్రసాద్, ఏవో సునీల్, ఏఈవో నరేష్, అచ్యుత్ పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో వ్యవసాయ పరిశోధన స్థానం, జిల్లా ఏరువాక కేంద్రం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాతావరణ పరిస్థితులతో మొగిపురుగు, సల్ఫైడ్ ప్రభావం, అగ్గితెగులు బాగా ఉందన్నారు. నివారణకు సూచించిన మందులు పిచికారీ చేయలన్నారు. మండల వ్యవసాయ అధికారి గుర్రం రజిత, వ్యవసాయ విస్తరణ అధికారులు తిరుపతి,రాకేష్, పాక్స్ వైస్ చైర్మన్ కందాల కొంరెల్లి,ఉపసర్పంచ్ రవికుమార్, రైతు గుడికందుల రాజయ్య పాల్గొన్నారు.

తడి, పొడి వరి సాగుపై అవగాహన

సైదాపూర్: మండలంలోని లస్మన్నపల్లిలో శనివారం తడి, పొడి వరి సాగుపై వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి పాల్గొని రైతులు ఎక్కువగా తడి, పొడి వరి సాగుపై దృష్టి సారించాలని సూచించారు. దీనివల్ల విద్యుత్ ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాములు, ఏఈవో రజిత, తదితరులు ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు రావాలి



పచ్చునూర్‌లో మొక్కలు నాటుతున్న అధికారులు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామంలో శనివారం రాజాపూర్ గ్రామానికి చెందిన చింతిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వ్యవసాయభూమిలో ఆయిల్ పామ్ మొక్కలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీధర్ నాటారు. రైతులు ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్, విండో చైర్మన్‌లు సంజీవరెడ్డి, వెంకట్‌రెడ్డి, సర్పంచ్ వసంత, మండల కోఆర్డినేటర్ వీరస్వామి, హార్టికల్చర్ అధికారిణి మంజువాణి, ఏఈవో శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

మానకొండూర్‌రూరల్: మండలంలోని పచ్చునూర్‌లో హార్టికల్చర్ డివిజనల్ అధికారిణి స్వాతి ఆధ్వర్యంలో శంకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, గణేశ్‌రెడ్డి రైతుల వ్యవసాయభూమిలో ఆయిల్‌పాం మొక్కలు నాటారు. ఆయిల్‌పామ్ సాగుతో అధికలాభాలు అర్జించవచ్చని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లోహియా సీడ్‌కంపెనీ అధికారులు రాజుకుమార్, రైతులు పాల్గొన్నారు.

రథ సప్తమి వేడుకలు



ఆలయంలో రథ సప్తమి వేడుకలు

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామం శ్రీ మానసాదేవి ఆలయంలో శనివారం రథ సప్తమి వేడుకలు ఆలయ ప్రధాన అర్చకుడు మామిడాల నాగసాయిశర్మ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన నవగ్రహ శాంతి, కల్యాణంలో 50 జంటలు పాల్గొన్నాయి. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు బద్దం నర్సింహారెడ్డి, చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, డాక్టర్ బద్దం తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ సంకల్ప దీక్ష విరమణ



అంజన్న సన్నిధిలో స్వాములు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంటలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయం పునర్నిర్మాణ సంకల్ప దీక్షను స్వాములు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శనివారం విరమించారు. శ్రావణమాసంలో నూతన ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించి జనవరి 24న విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలతో ముగించారు. ఈసందర్భంగా వేములవాడ రాజన్న, కొండగట్టు అంజన్న దేవాలయాలను దర్శించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో మహేందర్, రాజేందర్, ఐలేశం, తిరుపతి, స్వామి పాల్గొన్నారు.

నేడు ఎంపీ పర్యటన

రామడుగు: మండలంలోని కోరటపల్లి గ్రామంలో ఆదివారం కరీంనగర్ ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ పర్యటిస్తారని పార్టీ మండలశాఖ అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి తెలిపారు. గ్రామంలో కురుమ సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ, ఇతర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

కేజీబీవీలో స్వరక్ష డే



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ శైలజ

మానకొండూర్‌రూరల్: మండలంలోని కేజీబీవీలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్వరక్ష డే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏసీడీపీవో అరవింద హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్చుకోవాలన్నారు. కోఆర్డినేటర్ శైలజ విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, లింగవివక్ష, బాల్యవివాహాల నిర్మూలన, అక్రమరవాణా, లైంగిక వేధింపులు, చదువు మధ్యలో ఆపేయడం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ప్రిన్సిపల్ స్వప్న, కార్యదర్శి మధుమిత తదితరులు పాల్గొన్నారు.

ఖాళీలు భర్తీ చేయాలి

చిగురుమామిడి: మండలంలోని పాఠశాలల్లో ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేయాలని జెడ్పీటీసీ గీకురు రవీందర్ అన్నారు. శనివారం చిగురుమామిడిలో మాట్లాడారు. విద్యార్థులు అధికంగా ఉన్న పాఠశాలలను దృష్టిలో పెట్టుకుని ఖాళీలను భర్తీ చేస్తే సకాలంలో విద్య అందుతుందన్నారు. బదిలీల నేపథ్యంలో మండలానికి ప్రాధాన్యతనివ్వాలని జెడ్పీచైర్‌పర్సన్ విజయకు విజ్ఞప్తి చేశారు. విద్యాప్రమాణాలు పెంచేలా కృషి చేయాలన్నారు.

రాబోయే రోజుల్లో బీఆర్ఎస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు



మాట్లాడుతున్న సంపత్‌గౌడ్

మానకొండూర్: రాబోయే రోజుల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెబుతారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం మాట్లాడారు. గణతంత్ర వేడుకల సందర్భంగా పంచాయతీరాజ్ ఏఈ తిరుపతిపై ఎంపీపీ ముద్దసాని సులోచన భర్త శ్రీనివాస్‌రెడ్డి తీరును ఖండించారు. జెడ్పీటీసీది ఓ వర్గం, ఎంపీపీది ఓ వర్గమని, గ్రూపు తగాదాలతో అధికారులను ఇబ్బందులకు గురి చేయొద్దని సూచించారు. ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి గవర్నర్‌పై చేసిన వ్యాఖ్యలపై మండి పడ్డారు. ఇందిరమ్మ ఇల్లులేని ఊరిలో మేం ఓట్లు అడగం, డబుల్ బెడ్రూం ఇళ్లు లేని ఊరిలో మీరు ఓట్లు అడగొద్దనే సవాల్‌ను బీఆర్ఎస్ నాయకులు స్వీకరించాలని సూచించారు. రాహుల్ గాంధీ జోడో యాత్రకు సెక్యూరిటీ తగ్గించినా పాదయాత్ర ఆగదన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు నందగిరి రవీంద్రచారీ, ఎంపీటీసీ చలిగంటి సంపత్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు సాయిరి దేవయ్య, యూత్ అధ్యక్షుడు గట్టు శ్రీదర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కనకం అశోక్, మీస సత్యనారాయణ, నాగిరెడ్డి ఏగోలపు శ్రీనివాస్, తాళ్లపల్లి సంపత్, బాలకృష్ణ పాల్గొన్నారు.

నైపుణ్య సాధనపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న జ్ఞానేందర్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు నైపుణ్య సాధనపై దృష్టి పెట్టాలని బిలీవ్ కన్సల్టింగ్ సర్వీస్ మేనేజింగ్ డైరెక్టర్, ఫౌండర్ జ్ఞానేందర్‌రెడ్డి అన్నారు. శనివారం సింగాపూర్ గ్రామం వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో స్కిల్స్, ట్రైనింగ్, ఉద్యోగ అవకాశాలపై వర్క్‌షాపు నిర్వహించారు. రాబోయే ఐదేళ్లలో ఇంజనీరింగ్, డాక్టర్లకు డిమాండ్ ఉంటుందన్నారు. కళాశాలలోని పాఠ్యాంశాలను సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానం చేసి అధ్యయనం చేయాలన్నారు. టాస్క్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అజయ్, బిలీవ్ సేల్స్ ఆపరేషన్ మేనేజర్ మహమ్మద్ విజయ్, తిరుపతి, గణేష్, మల్లేశం, శారద, రజిత,కోమల, అశోక్, సదానందం, హరీశ్ ఉన్నారు.

ఆర్థిక సాయం

చొప్పదండి: పట్టణానికి చెందిన మంద జనార్దన్ (43) శనివారం అనారోగ్యంతో మృతి చెందగా దహన సంస్కారాలకు రామకృష్ణ సేవా సమితిని సంప్రదించగా రూ.ఐదువేల ఆర్థిక సాయం అందించారు. సేవా సమితి దాత నరేశ్ నగదు సమకూర్చగా నలుమాచు రామక్రిష్ణ, పడకంటి క్రిష్ణ, చెట్ల రాంకిషన్, సిరిపురం గంగారం అందించారు.

అర్హులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

హుజూరాబాద్: ప్రభుత్వం పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులకే కేటాయించాలని, గతంలో ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో ఇల్లు నిర్మించుకోవడానికి ఆర్థికసాయం చేయాలని జనతాదళ్ (సెక్యులర్) పార్టీ జేడీఎస్ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి అన్నారు. శనివారం హుజూరాబాద్ పట్టణంలో మాట్లాడారు. సొంతిల్లు లేక అద్దె ఇళ్లలో ఉంటున్నవారికి ఇళ్లు ఇవ్వాలని, అవకతవకలకు పాల్పడకుండా అధికారులు, రాజకీయ నాయకులు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. బీసీ నాయకులు వెంకన్న, సమ్మయ్య, రాజేందర్, కొమరయ్య, ప్రభాకర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యయనోత్సవాలు



అధ్యయనోత్సవాల్లో వేదపండితులు

శంకరపట్నం: కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయంలో శనివారం అధ్యయనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు శేషం మురళీధరాచార్యులు, వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఫ్రెషర్స్ డే హంగామా



హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఈఈఈ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కందుకూరి శంకర్ హాజరై మాట్లాడారు. కళాశాలలోని అన్ని రకాల సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థుల శారీరక సామర్థ్యం కోసం ఇండోర్ గేమ్స్, జిమ్ సెంటర్లు ఉన్నాయన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి రాజేశ్వర్‌రావు, ఉపాధి శిక్షణ అధికారిణి డాక్టర్ విజయలక్ష్మీ, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ కె. రవీంద్రబాబు,ఫ్రెషర్స్ డే సమన్వయకర్త అధ్యాపకుడు రాజేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

యాదవ సంఘం సభ్యులకు సన్మానం



సన్మానిస్తున్న అలువాల కోటి

గన్నేరువరం: మండలంలోని పారువెల్ల గ్రామ యాదవ సంఘం అధ్యక్షుడు కనకయ్య, ఉపాధ్యక్షుడు ఎలుక రాజు, కోశాధికారి చౌదరి మల్లేశం, కార్యవర్గ సభ్యులను శనివారం సహకార సంఘం చైర్మన్, కేడీసీసీబీ డైరెక్టర్ అలువాల కోటి సంఘం ఆవరణలో శనివారం శాలువాతో సన్మానించారు. సంఘం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యాదవ సంఘం డైరెక్టర్ అనిల్, సంగు వేణు, ఏడు మ్యాకల దేవరాజు, సంగు రవి పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి కొలతలు



కొలతలు చేపడుతున్న పాలకవర్గం

మానకొండూర్: మండల కేంద్రంలోని మానకొండూర్-జమ్మికుంట రోడ్డు, కరీంనగర్, వరంగల్ రహదారి వెంట ఉన్న కబ్రస్థాన్‌ల చుట్టూ ప్రహరీకి రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు రూ. 26 లక్షల నిధులు మంజూరు చేశారు. శనివారం ప్రహరీ నిర్మాణానికి పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో కొలతలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు బోడ రాజశేఖర్, సయ్యద్, సిరాజోద్దీన్, ఎండీ గౌస్‌ఖాన్, అమీరుల్లాఖాన్, సయ్యద్ అబ్దుల్ తదితరులున్నారు.

ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కొత్త వినీత

చిగురుమామిడి: ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందినప్పుడే జీవితం సార్థకమవుతుందని ఎంపీపీ కొత్త వినీత అన్నారు. శనివారం చిగురుమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బదిలీపై వెళ్తున్న మెడికల్ ఆఫీసర్ నాగశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కోవిడ్ సమయంలో నాగశేఖర్ సేవలను మండలంలోని ప్రజలు మరిచిపోలేరని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యం అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవీందర్, తహసీల్దార్ ముబీన్‌అహ్మద్, ఎంపీడీఓ నర్సయ్య, మెడికల్ ఆఫీసర్ ధర్మానాయక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీ షర్టులు అందజేత



టీషర్టులు అందిస్తున్న విజేందర్‌రెడ్డి

గంగాధర: మండలంలోని గట్టుబుత్కూర్ గ్రామానికి చెందిన క్రికెట్ క్రీడాకారులకు శనివారం సర్పంచ్ కంకణాల విజేందర్‌రెడ్డి అందజేశారు. మైత్రీ గ్రూప్ టీషర్టు సమకూర్చింది.

వృద్ధులు, అనాథలకు అన్నదానం

జమ్మికుంట: పట్టణంలో సర్వ్ పీపుల్స్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక నిర్వాహకుడు రసమల్ల శేఖర్ ఆధ్వర్యంలో శనివారం యాచకులు, వృద్ధులు, అనాథలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారంలో మూడు రోజులు పాటు వారు ఎక్కడ ఉంటే అక్కడకు వెళ్లి భోజనం అందిస్తామన్నారు. సమాజ సేవ లక్ష్యంగా ఉన్నంతలో చేస్తున్నామని, దాతలు ముందుకు వస్తే మరిన్న సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రచ్చరవికృష్ణ, ఎస్‌కే సలీమ్, ప్రశాంత్, తపాల వంశీ తదితరులు పాల్గొన్నారు.

'మైనార్టీలపై కపట ప్రేమ'

హుజూరాబాద్: మైనార్టీలపై బీఆర్ఎస్ ప్రభుత్వం కపట ప్రేమ చూపుతోందని హుజూరాబాద్ మైనార్టీ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మహ్మద్ అప్సర్ అన్నారు. శనివారం మాట్లాడుతూ... హుజూరాబాద్‌లో ముస్లింల షాదీ ఖానా, కమ్యూనిటీ హాల్‌కు రూ.కోటికిపైగా నిధులు మంజూరయ్యాయనేది కాగితాలకే పరిమితమైందన్నారు. ఓట్లకు ముందు ప్రభుత్వం నిధులు కేటాయించడం, మంజూరులో వెనకంజ వేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణం నిధులు మంజూరు చేసి త్వరగా పనులు ప్రారంభించాలన్నారు. లేదంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ముఖిద్‌భాయ్, ఖాదర్, హబీబ్, ఇమ్రాన్, సలీం, డి. సిరాజ్, లతీఫ్ తదితరులు ఉన్నారు.